సాక్షి రాజన్న సిరిసిల్ల

సాక్షి టాక్ షో
స్పెషల్ స్టోరీస్
సండే స్పెషల్

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



తిమ్మాపూర్ వాగేశ్వరి ఫార్మసీ విద్యార్థులు



కరీంనగర్‌లో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థినులు



స్నేహం.. ఓ వరం

- అనుకోకుండా పరిచయమై, జీవితాంతం తోడుంటుంది..
- కష్టనష్టాల్లో అండగా ఉండేవారే మిత్రులు
- నేడు స్నేహితుల దినోత్సవం

కరీంనగర్ సిటీ/విద్యానగర్(కరీంనగర్)/: 'స్నేహానికి కన్న మిన్న లోకాన లేదురా.. కడదాక నీడ లాగ నిను వీడిపోదురా' అని ఓ కవి అన్నట్లు స్నేహబంధం ఎప్పటికీ మనతోనే ఉంటూ మన జీవితంలో భాగమవుతుంది. అది ఓ వరం. పుట్టినప్పుడు మనతోపాటు ఎన్నో బంధాలు, రక్త సంబంధాలు ఏర్పడుతాయి. కానీ తర్వాత మన నడవడిక, వ్యక్తిత్వం ఆధారంగా స్నేహం మన జీవితంలోకి వస్తుంది. ఆపదలో ఆదుకుంటూ.. కష్టాల్లో పక్కనుంటూ.. ఎదుగుదలలో తోడుంటూ.. ఇలా రక్త సంబంధం చేయలేనిది కూడా స్నేహ హస్తం చేస్తుంది. మనం విజయం సాధించినప్పుడు చప్పట్లు కొట్టేవాళ్లు.. విషాదంలో ఉన్నపుడు ఓదార్చేవాళ్లు నలుగురు లేని జీవితాన్ని ఎవరూ ఊహించరు. అందుకే మనుషులందరికీ తలా ఓ పేరున్నప్పటికీ అందరినీ దగ్గరకు చేర్చేది మాత్రం స్నేహబంధమే. నేడు స్నేహితుల దినోత్సవం. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని శ్రీచైతన్య డిగ్రీ కాలేజీలో 'సాక్షి' 40 మంది విద్యార్థులతో శనివారం చర్చావేదిక నిర్వహించింది. ఎక్కువ మంది ఆన్‌లైన్ స్నేహంలో మోసాలుంటాయని, నమ్మకం లేదని చెప్పారు. చిన్నప్పటి నుంచి ఉన్న స్నేహం బలంగా ఉంటుందని తెలిపారు.

పేరెంట్స్ తర్వాత ఫ్రెండ్సే..



పేరెంట్స్ తర్వాత ఫ్రెండ్సే ముఖ్యం. ఇంట్లో చెప్పలేని విషయాలు కూడా ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకుంటాం. ఆపదలో ఒకరికి ఒకరు తోడుగా నిలిచేది ఫ్రెండ్సే. వారితో ప్రయాణం చాలా విలువైనది.

– అసాధ్య, ఫార్మ్ డీ, వాగేశ్వరి

ఒకరికొకరు తోడు..



స్నేహితులను ఎంచుకునే సమయంలో మంచి వారిని ఎంచుకుంటే జీవితంలో కష్టసుఖాల్లో తోడుంటారు. మంచి వారు ఎప్పుడూ ఒకరికొకరు తోడుంటారు.

– చందన, వాగేశ్వరి

స్వార్థం లేనిది..



నిస్వార్థమైనది స్నేహ మొక్కటే. కష్టమొచ్చినా.. సంతోషమొచ్చినా తోడుండే వారే ఫ్రెండ్స్. నేను ఎక్కడో మహబూబాబాద్ జిల్లా నుంచి వచ్చిన. ఇక్కడ అందరూ అన్నదమ్ములుగా ఉండి స్నేహం విలువ తెలిపారు.

– ప్రశాంత్, వాగేశ్వరి

ఫ్రెండ్ అవసరమే..



ఆరు సంవత్సరాల ఫార్మసీ రంగంలో నాకు ప్రతీ ఫ్రెండ్ అవసరమే. కష్టసుఖాల్లో స్నేహితులే దేవుళ్లు. మా ఓర్పును భరించడమే కాకుండా జీవితంలో ముందడుగు వేయడానికి ప్రతీ స్నేహితుడు అవసరమే.

– అక్షయ, వాగేశ్వరి

విద్యార్థులే స్నేహితులు..



కళాశాలలో 20 సంవత్సరాల సుదీర్ఘకాలంలో మాకు విద్యార్థులను మించిన స్నేహితులు లేరు. ప్రతీ బ్యాచ్‌తో మాకు గొప్ప అనుభవం ఎదురవుతుంది. ఫ్రెండ్‌షిప్ విలువ తెలిసిన వారు జీవితంలో ఎదుగుతారు.

– శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఫార్మసీ కాలేజీ

– తిమ్మాపూర్

నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు..



మేము నాలుగో తరగతిలో పరిచయమయ్యాం. మా ప్రయాణం ఇబ్బంది లేకుండా డిగ్రీ వరకు వచ్చింది. ఎంతో స్నేహంగా ఉంటూ సంతోషాలు, బాధలను పంచుకుంటాం. కష్టాల్లో ఒకరికొకరం అండగా ఉంటాం.– కీర్తిక, కేజీయా, కొత్తపేట, బోయినపల్లి మండలం

స్నేహితులకే చెప్పకుంటాం

తల్లిదండ్రులు, తోబుట్టువులు, బంధువులకు చెప్పుకోలేని చాలా సమస్యలను స్నేహితులతో చెప్పుకుంటాం. అనుకోకుండా పరిచయమై, జీవితాంతం నేనున్నా అంటూ వచ్చేది ఒక్క స్నేహమే.

– సుచరిత, శివాణి, పెద్దపల్లి



కష్టాల్లో ఆదుకునేలా ఉండాలి



స్నేహం కష్టాల్లో ఆదుకునేలా ఉండాలి. బాధలో ఉన్నప్పుడు మనసు విప్పి మాట్లాడితే సాంత్వన చేకూరుతుంది. ఒక మంచిమాటతో మనసును కుదుటపడేలా చేసి, ముందుకు నడిపించేది స్నేహమే. – భూమిక, జగిత్యాల

నమ్మకం.. నిజాయితీ ఉండాలి



నిజాయితీ, నమ్మకంతో కూడిన స్నేహం కావాలి. కానీ నేడు అవసరాలకు మాత్రమే చేస్తున్నారు. అవి తీరగానే దూరమైపోతున్నారు. జీవితాంతం తోడు నిలిచే స్నేహం ఆనందాన్నిస్తుంది.

– విద్య, తాళ్లపల్లి, ఇల్లంతకుంట మండలం

ఆ బంధం గొప్పది



స్నేహంలో ఆడ, మగ అనే తేడా ఉండదు. మన మంచికోరే వారితో ఫ్రెండ్‌షిప్ జీవితాంతం బాగుంటుంది. నేను ఎక్కువ సమయం స్నేహితులతోనే ఉంటా. స్నేహబంధం ఎంతో గొప్పది.

– కృష్ణతేజ, వేములవాడ

నలుగురం కలిసి చదువుకున్నం



కోరుకంటి శ్రీకాంత్, తణుకు శ్రీనాథ్, సుంచు మల్లయ్య, నేను నలుగురం స్నేహితులం. శిశు తరగతి నుంచి ఇంటర్ వరకు కలిసే చదువుకున్నం. అప్పటి స్నేహం ఇంకా కొనసాగుతోంది. అందరం జీవితాల్లో స్థిరపడ్డాం. ప్రతీ వారం కలుసుకుంటం. పండుగలు, శుభకార్యాలకు ఒకరింటికి ఒకరం వెళ్తాం. కష్టనష్టాల్లో తోడుగా ఉంటున్నం.

– రావుల సుధాకర్, కిసాన్‌నగర్, కరీంనగర్

వైద్యానికి సాయం



బోయినపల్లి(చొప్పదండి): బూర్గుపల్లికి చెందిన అక్కరాజు గంగరాజుది పేద కుటుంబం. తల్లి పడుతున్న కష్టాన్ని చూడలేక ఇంటర్ వరకు చదివి ఆపేశాడు. చిన్నాచితక పనులు చేస్తూ తల్లికి సాయంగా ఉండేవాడు. నెల రోజుల క్రితం కాలేయ సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు పెరుక మహేశ్ వాట్సాప్ గ్రూపుల ద్వారా రూ.1.37 లక్షలు సేకరించి, చికిత్స చేయించారు.

స్నేహబంధమే శాశ్వతం



సాక్షి, పెద్దపల్లి: స్నేహబంధమే శాశ్వతం. ఇప్పటికీ నా స్కూల్‌మేట్స్‌ను కలుస్తుంటా. నా బెస్ట్ ఫ్రెండ్ అమూద్. వాడు నేను అహ్మద్‌నగర్‌లో స్కూల్, కాలేజీ వరకు కలిసి చదువుకున్నాం. సివిల్స్ ప్రిపేర్ అవుతున్న సమయంలో నాలో కాన్ఫిడెన్స్ తగ్గకుండా ఎప్పుడూ మోటివేట్ చేస్తుండేవాడు. అమూద్ ఇంజినీర్‌గా, మిగతా మిత్రులు వివిధ దేశాలు, పట్టణాల్లో డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థిరపడ్డారు. మేము ఎక్కడ ఉన్నా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాం. ఏటా టూర్ ప్లాన్ చేసుకుంటాం.

– వైభవ్‌గైక్వాడ్, పెద్దపల్లి డీసీపీ

8వ తరగతిలో పరిచయం



మేము ముగ్గురం 8వ తరగతిలో పరిచయమయ్యాం. డిగ్రీ వరకు కలిసే చదువుకున్నాం. ఏ సమస్య వచ్చినా చర్చించుకొని, పరిష్కరించుకుంటాం.

– కావ్య, వర్షిణి, తేజస్విని, వేములవాడ

మిత్రుడి పేరిట స్కూల్..



విద్యార్థులకు మెమొంటోలు అందిస్తున్న గాజుల శ్రీనివాస్, మిత్రులు (ఫైల్)



దయానంద్ (ఫైల్)

సిరిసిల్ల: పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన గోసికొండ దయానంద్ 2002లో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన యాదిలో చిన్ననాటి మిత్రులు ఏదైనా చేయాలని నిర్ణయించున్నారు. గాజుల శ్రీనివాస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, యూఎస్ఏ సిరిసిల్ల పట్టణ శివారులో 22 గుంటల స్థలం కొనుగోలు చేసి, రూ.30 లక్షలతో 2006లో దయానంద్ మెమోరియల్ స్కూల్ స్థాపించారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉచితంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యనందిస్తున్నారు. రాజీవ్‌నగర్ కార్మిక క్షేత్రంలోని పేదవాళ్లు తమ పిల్లలను ఇక్కడికి పంపిస్తున్నారు. ప్రస్తుతం 65 మంది విద్యార్థులు ఉన్నారు. స్కూల్ నిర్వహణకు ఏటా రూ.5 లక్షలు ఖర్చవుతోంది. ఇందులో ఎక్కువ మొత్తాన్ని శ్రీనివాస్ భరిస్తున్నారు. బోడ రవీందర్, సిరిసిల్ల తిరుపతి, కట్కం గోపి, పయ్యావుల శ్రీనివాస్, బి.రాము, బొడ్డు శ్రీధర్, లింగమూర్తి, సిరిసిల్ల తిరుమలేశ్, వూరడి రవి, కోడం సుధాకర్ పాఠశాల నిర్వహణలో భాగస్వాములవుతూ స్నేహానికి నిజమైన నిర్వచనంగా నిలుస్తున్నారు.

ఊరి నుంచి గల్ఫ్ దాకా..



స్నేహితులతో దేవ్‌యాదవ్ (సర్కిల్‌లో)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని చింతకుంటకు చెందిన బైర దేవ్‌యాదవ్ ఉపాధి నిమిత్తం 12 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో సరైన పని దొరికింది. తన స్నేహితులు గ్రామంలోనే వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ ఆర్థికంగా ఎదగడం లేదని భావించాడు. ఒక్కొక్కరికి వీసా పంపిస్తూ 18 మందిని సౌదీ రప్పించుకొని, ఉపాధి చూపించాడు. చిన్నతనంలో గ్రామంలో అందరం కలిసి ఆడుకునే వాళ్లమని.. గల్ఫ్‌లో ఒకేచోట పని చేస్తుండటం ఆనందంగా ఉందని దేవ్‌యాదవ్ తెలిపాడు.

వైద్య మిత్రులు





పెంచలయ్య, పి.చంద్రశేఖర్, రమణారావు రిటైర్డ్ డీఎంహెచ్‌వో

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన ప్రముఖ వైద్యులు పెంచలయ్య, రమణారావు, చంద్రశేఖర్ మంచి మిత్రులు. 40 ఏళ్ల క్రితం మెడిసిన్ చదువుతున్న రోజుల్లో ముగ్గురూ కర్నూలు మెడికల్ కాలేజీలో స్నేహితులయ్యారు. పెంచలయ్య కడప పట్టణానికి, ఎస్వీ రమణారావు నెల్లూరు జిల్లా సర్వేపల్లి మండలం నిడిగుంటపాలెంకు, చంద్రశేఖర్ నెల్లూరు పట్టణానికి చెందినవారు. ఎంబీబీఎస్ సెకండియర్ చదివే పెంచలయ్యకు ఫస్టియర్ చదివే రమణారావు, చంద్రశేఖర్‌ల మధ్య కాలేజీ ఫంక్షన్‌లో స్నేహం కుదిరింది. పెంచలయ్య, చంద్రశేఖర్ 1993లో సిరిసిల్లకు వచ్చి, ప్రాక్టీస్ ప్రారంభించగా.. 1995లో రమణారావు వచ్చారు. ప్రభుత్వ వైద్యులుగా సర్జన్ పెంచలయ్య, రిటైర్డ్ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఆర్థోపెడిక్ రమణారావు నిజాయితీకి మారుపేరుగా గుర్తింపు పొందారు.

చేనేత దినోత్సవం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల: హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవంలో అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ కోరారు. సిరిసిల్ల జౌళిశాఖ ఆఫీస్‌లో వస్త్రోత్పత్తిదారులతో శనివారం సమావేశమయ్యారు. ప్రవీణ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవానికి సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు, కార్మికులు, ఆసాములు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. జౌళిశాఖ ఏడీ సాగర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం, కార్యదర్శి యెల్దండి దేవదాస్, వస్త్రోత్పత్తిదారులు గోవిందు రవి, మోర రాజు, చిమ్మని ప్రకాశ్, బీమని రామచంద్రం, యెల్దండి శంకర్, పోలు శంకర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా పారిశుద్ధ్యం పనులు

- వరద ప్రాంతాల్లో సిబ్బంది పెంపు
- మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్



కార్మికులకు సూచనలిస్తున్న కమిషనర్ ఆయాజ్

సిరిసిల్లటౌన్: స్వచ్ఛ పట్టణ కీర్తి కొనసాగేలా సిరిసిల్లలో పారిశుద్ధ్యం పనులను మరింత పకడ్బందీగా చేపడతామని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్ పేర్కొన్నారు. ఇటీవల విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్ శనివారం పలు వార్డుల్లోని పారిశుధ్యం పనులను పరిశీలించి మాట్లాడారు. ఇంటింటి చెత్త సేకరణ, వార్డులవారీగా డ్రెయినేజీ క్లీనింగ్ పనులను ఆరా తీశారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలన




రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్, డీఎస్పీ

వేములవాడఅర్బన్/బోయినపల్లి/చందుర్తి (వేములవాడ): జూనియర్ పంచాయతీ రెగ్యులరైజేషన్ కోసం వారి పనితీరును పరిశీలించేందుకు జిల్లా అధికారుల బృందం శనివారం వేములవాడఅర్బన్, బోయినపల్లి, చందుర్తి మండలాల్లో పర్యటించారు. అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల పనితీరును తెలుసుకునేందుకు జీపీల్లోని రికార్డులు పరిశీలించారు. బోయినపల్లి ఎంపీడీవో పి.లచ్చాలు, ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్‌రెడ్డి, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలపై సర్కార్ వివక్ష

- ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలి
- సిరిసిల్ల కలెక్టరేట్ ముట్టడి



ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

సిరిసిల్లటౌన్: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరితే.. అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని రెండో ఏఎన్‌ఎంలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ శనివారం కలెక్టరేట్‌ను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ముట్టడించారు. పదిహేనేళ్లుగా వెట్టిచాకిరికి గురవుతున్న తమకు న్యాయం కావాలని కోరారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ఆఫీసులో అందించారు. నాయకులు సామల మల్లేశం, అజ్జ వేణు, కదారి రాములు, రవి, నాగరాజు, హేమలత, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.

'సూపర్ హీరో' అవార్డు సాధించాలి

- ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన
- రూల్స్ పాటిస్తేనే హ్యాపీ జర్నీ
- ఎస్పీ అఖిల్ మహాజన్



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లటౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించిన యువత, విద్యార్థులకు 'సూపర్ హీరో' అవార్డులు అందజేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని నేతన్నచౌక్‌లో స్వచ్ఛంద సంస్థలు, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలపై శనివారం అవగాహన కల్పించారు. దేశంలో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం యువతే చనిపోవడం బాధాకరమన్నారు. ప్రమాదాలకు గురికావద్దనే ఉద్దేశంతోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్(ఆర్ఎస్ఈ) ద్వారా సేవ్ లైఫ్స్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించడం సామాజిక బాధ్యతగా తీసుకున్నప్పుడే ప్రమాదాలు జరుగవన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, టౌన్ సీఐ ఉపేందర్, ఆర్ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): క్రమశిక్షణతోపాటు నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలని పోలీస్ సిబ్బందికి ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. మండలంలోని తాడూర్ పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో శనివారం జరిగిన పరేడ్‌కు హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఏఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు యాదగిరి, మధుకర్, సీఐలు ఉపేందర్, రవీందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇళ్లు కోల్పోయిన బాధితులకు సాయం



సాయం అందిస్తున్న ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఇంటి పైకప్పులు, నిత్యావసర సరుకులు అందించారు. ఎండీ ఖాదీర్, బోయిని చిన్ననర్సయ్య, కెమ్మసారపు రవి, పెద్దనపల్లి రాజు కుటుంబాలకు ఇళ్లపై కప్పుకునేందుకు ప్లాస్టిక్ కవర్లు, వంట సామగ్రి అందించారు. సర్పంచ్ కోల అంజమ్మ, ఎంపీటీసీ మామిండ్ల తిరుపతిబాబు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైర్మన్ గుడ్ల రవి, కోశాధికారి శివప్రసాద్‌రావు, సభ్యులు కె.వేణు, సర్పంచ్ కోల అంజవ్వ పాల్గొన్నారు.

పోయిన మొబైల్ అప్పగింత



సెల్‌ఫోన్ అందిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం ఆరేపల్లికి చెందిన యాస శిరీష సెల్‌ఫోన్ పోగొట్టుకోగా.. ఎల్లారెడ్డిపేట పోలీసులు వెతికి అప్పగించారు. సీఐ శశిధర్ తెలిపిన వివరాలు. శిరీష ఫిర్యాదుతో సీఈఐఆర్ యాప్‌లో నమోదు చేయగా.. సెల్‌ఫోన్ ఆచూకీ తెలిసింది. వెంటనే స్వాధీనం చేసుకొని శిరీషకు సీఐ శశిధర్‌రెడ్డి అప్పగించారు.

లిక్కర్ పాలసీ విధానంతో గిరిజనులకు అన్యాయం

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లిక్కర్ పాలసీ విధానంతో నిరుపేద గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆలిండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు మాలోతు రాంచందర్‌నాయక్, కార్యదర్శి గుగులోతు రాందాస్‌నాయక్ డిమాండ్ చేశారు. లిక్కర్ పాలసీ విధానంలో గిరిజనులకు ఎందుకు రిజర్వేషన్ కల్పించలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైన్‌షాపులలో గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

పశువుల సంరక్షణ బాధ్యతగా భావించాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పశువుల సంరక్షణను రైతులు బాధ్యతగా గుర్తిస్తూ.. సరైన సమయంలో టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రేణుక పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో శనివారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. గాలికుంటు వ్యాధితో బాధపడుతున్న పశువులకు వ్యాక్సిన్లు వేశారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్‌లో మండల వ్యాప్తంగా పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ కదిరె రజిత, ఉప సర్పంచ్ హనుమంతు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలకు పక్కా భవనాలు

- రాజన్నసిరిసిల్ల కళాశాలకు రూ.107 కోట్లు
- కరీంనగర్ కాలేజీకి రూ.104 కోట్లు అంచనా
- టెండర్లు పిలిచిన రాష్ట్ర ప్రభుత్వం
- భవన నిర్మాణాల పూర్తికి 15 నెలల కాలపరిమితి
- వచ్చే విద్యాసంవత్సరం అందుబాటులోకి..



సిరిసిల్ల మెడికల్ కాలేజీ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వైద్య విద్యార్థులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఈ ఏడాది పాత జిల్లాలో మంజూరైన సిరిసిల్ల, కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీల భవన నిర్మాణాల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో రూ.991 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 9 మెడికల్ కాలేజీలు అత్యాధునిక సదుపాయాలతో వచ్చే విద్యాసంవత్సరం అందుబాటులోకి రానున్నాయి. గత నెల 31వ తేదీన ప్రభుత్వం సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం కోసం టెండర్లు పిలిచింది. ఇందులో కరీంనగర్ కాలేజీకి రూ.104.5 కోట్లు, రాజన్న సిరిసిల్ల కాలేజీకి రూ.107.3 కోట్లు అంచనాగా పేర్కొంది. టెండర్ల ప్రక్రియ రెండు వారాల్లో ముగిసి, దక్కించుకున్న సంస్థ ఈ నెల చివరలో పనులు ప్రారంభించనున్నట్లు సమాచారం. పనులు మొదలైన 15 నెలల్లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. ఈలోగా నీట్ కౌన్సెలింగ్ ముగిసి, 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన తరగతులు తాత్కాలిక భవనాల్లో ప్రారంభం కానున్నాయి.

పెద్దూరులో 80 ఎకరాలు కేటాయింపు

రాజన్న సిరిసిల్ల జిల్లాకు 11 మే 2023న మెడికల్ కళాశాల మంజూరైంది. మొత్తం 100 సీట్లకుగాను ప్రభుత్వం రూ.166 కోట్లు ఖర్చు చేయనుంది. జిల్లాలో 255 గ్రామాలుండగా సుమారు 5,80,000 జనాభా ఉంది. 13 మండలాలు, 2 మున్సిపాలిటీలు ఉన్నాయి. సర్కారు మెడికల్ కాలేజీకి సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరులో 80 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఇక్కడ కళాశాల భవన నిర్మాణం పూర్తి కావొచ్చింది. పలు దఫాలుగా నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం ఈసారి రూ.107.3 కోట్ల పనులకు టెండర్లు పిలవడంతో పనులు త్వరగా పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మెడికల్ కళాశాలలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుండగా.. ఫస్ట్ ఫేజ్‌లో 15 మంది విద్యార్థులను కేటాయించారు. సెప్టెంబర్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

కొత్తపల్లి విత్తనాభివృద్ధి కేంద్రంలో 20 ఎకరాలు

కరీంనగర్ మెడికల్ కళాశాల ఏర్పాటుకు తొలుత నవంబర్ 2022లో ప్రభుత్వ ప్రకటన చేసింది. చాలా ఏళ్లుగా కరీంనగర్ కేంద్రంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ నెలకొల్పాలన్న ప్రజల డిమాండ్ ఎట్టకేలకు నెరవేరినట్లయింది. వాస్తవానికి ఈ కళాశాల అనుమతి కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైందన్న ప్రచారం జరిగింది. చివరకు 2023న జూన్‌లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అదే నెల 17న 100 మెడికల్ సీట్ల భర్తీకి అనుమతి లభించింది. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. కొందుకు విద్యార్థులు అడ్మిషన్ పొందారు. మెడికల్ కాలేజీకి భవనాలు నిర్మించేందుకు కొత్తపల్లి విత్తనాభివృద్ధి కేంద్రంలో 20 ఎకరాల స్థలం కేటాయించారు. అక్కడే ఉన్న గోదాముల్లో తాత్కాలిక తరగతి గదుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. తాజాగా రూ.104.5 కోట్ల అంచనా వ్యయంతో భవనాల నిర్మాణాలకు టెండర్లు పిలవడంతో పనులు ఊపందుకోనున్నాయి. నిర్మాణాల పూర్తికి సర్కారు 15 నెలల కాలపరిమితి విధించింది.

యువత సంక్షేమానికి సర్కారు పెద్దపీట



వర్క్‌షాపులో యువతతో జిందం కళ, ఆయాజ్

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: యువత సంక్షేమానికి సర్కారు పెద్దపీట వేసిందని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్ పేర్కొన్నారు. స్థానిక సుభాష్‌నగర్‌లోని సిరిసిల్ల ఫంక్షన్ హాల్‌లో అవేర్‌నెస్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సంకల్ప్ పథకం కార్యక్రమం వర్క్‌షాపును ప్రారంభించి మాట్లాడారు. పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ, యువకులకు వారి అభిరుచుల మేరకు వృత్తిపరమైన నైపుణ్యంతో శిక్షణ అందించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే సంకల్ప్ లక్ష్యమన్నారు. అనంతరం ప్రశంసాపత్రాలు అందించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్, కౌన్సిలర్ దార్నం అరుణ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎన్వీ దుర్గారెడ్డి, మెప్మా టీఎంసీ రాజమణి పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాహుల్‌గాంధీపై సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై కాంగ్రెస్ నాయకులు శనివారం ఎల్లారెడ్డిపేటలో సంబరాలు చేసుకున్నారు. రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేశారు. సుప్రీంకోర్టులో రాహుల్‌గాంధీకి న్యాయం జరిగిందన్నారు. రాహుల్‌గాంధీకి పాదయాత్రతో వచ్చిన పేరును బీజేపీ నాయకులు తట్టుకోవడం లేదన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి లింగం గౌడ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే సాహెబ్, బ్లాకు కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, చెన్నిబాబు, గంట బుచ్చాగౌడ్, కొత్తపల్లి దేవయ్య, మామిండ్ల కిషన్, తిరుపతిరెడ్డి, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గుండెపోటుతో కుటుంబ పెద్ద మృతి

- రోడ్డున పడ్డ భార్య, ఇద్దరు కూతుళ్లు
- సొంతిల్లు లేక బంధువుల ఇంట్లో తలదాచుకున్న వైనం
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కుటుంబ పెద్ద గుండెపోటుతో మృతిచెందడంతో భార్యపిల్లలు రోడ్డున పడ్డారు. పాతికేళ్ల వయసులోనే ఇద్దరు కూతుళ్ల పెంపకం బాధ్యతలు ఆమెపై పడ్డాయి. సొంతిల్లు లేక బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్నారు. దాతలు స్పందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన కోల ప్రవీణ్‌గౌడ్ (30)కు కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఇసాయిపేటకు చెందిన రేఖతో 2019లో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు తన్విత(2), తపస్య(1). ప్రవీణ్‌గౌడ్ కొంతకాలం హైదరాబాద్‌లో ప్రైవేట్ కాంట్రాక్ట్ నిర్వహిస్తుండగా అది ఆగిపోవడంతో కామారెడ్డిలో అద్దె ఇంట్లో ఉంటూ ఆటో నడుపుకుంటున్నాడు. ఈనెల 1వ తేదీ అర్ధరాత్రి గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. ప్రవీణ్ అకాల మరణంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. సొంత ఇల్లు లేక, కుటుంబపెద్ద మరణించడంతో వారు రోడ్డున పడ్డారు. ఇద్దరు కూతుళ్లతో చిన్నవయసులోనే పుట్టెడు కష్టాలు రేఖను వెంటాడుతున్నాయి. దాతలు స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సహాయం చేయాలనుకునే వారు రేఖ 99125 33064, విఘ్నేశ్ 95425 25145 ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఆదుకోవాలని కోరుతున్నారు.



తల్లితో చిన్నారులు

వైన్‌షాపులకు ఎన్నైనా దరఖాస్తులు చేయొచ్చు

- ఆగస్టు 18తో ముగియనున్న గడువు
- ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ పంచాక్షరి



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ పంచాక్షరి

సిరిసిల్ల: జిల్లాలోని మద్యం దుకాణాలకు ఒక్కరు ఎన్నైనా దరఖాస్తులు చేసుకోవచ్చని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ ఎస్.పంచాక్షరి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మద్యం షాపుల టెండర్లకు గెజిట్ నోటిఫికేషన్ జారీ అయిందని, మారిన పాలసీ ప్రకారం ఒకరు ఎన్ని షాపులకైనా ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని తెలిపారు. ప్రతీ దరఖాస్తుతో రూ.2లక్షల డీడీ, లేదా చలానా జత చేయాలని, వాటిని తిరిగి ఇవ్వబోరని తెలిపారు. జిల్లాలోని 48 షాపులలో గౌడకులస్తులకు 9, ఎస్సీ సామాజికవర్గానికి 5 షాపులు రిజర్వ్ చేసినట్లు చెప్పారు. మిగతా 34 షాపులకు జనరల్ కేటగిరీ కింద అందరూ టెండర్లు వేయవచ్చన్నారు. ఆగస్టు 18వ తేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతోపాటు మూడు పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలు, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్‌లు, రిజర్వేషన్ కేటగిరీ అయితే కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని కోరారు. ఆగస్టు 21న కలెక్టర్ సమక్షంలో డ్రా తీయనున్నట్లు తెలిపారు. డ్రాలో ఎంపికైన అభ్యర్థులు అదే రోజు లేదా మరుసటి రోజు ఎక్సైజ్ ట్యాక్స్ ఆరోవంతు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఎంపికైన అభ్యర్థులు ఆ షాపు నిర్వహణకు నిరాకరిస్తే ప్రభుత్వానికి రూ.5లక్షలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. కొత్త మద్యం దుకాణాలను డిసెంబరు 1, 2023 నుంచి 2025 నవంబరు 30 వరకు నిర్వహించుకోవచ్చన్నారు. సీఐలు గులాం ముస్తఫా, ఎంపీఆర్ చంద్రశేఖర్, గుండేటి రాము పాల్గొన్నారు.

జిల్లాలో తుంపర వానలు

సిరిసిల్ల: జిల్లాలో శనివారం చిరుజల్లులు పడ్డాయి. తొమ్మిది మండలాల్లో వర్షం పడగా.. నాలుగు మండలాల్లో చినుకు జాడ లేదు. రుద్రంగిలో అత్యధికంగా 3.7 మిల్లీమీటర్ల వర్షం పడగా.. చందుర్తిలో 3.5, వేములవాడరూరల్‌లో 1.1, బోయినపల్లిలో 2.6, వేములవాడలో 1.8, సిరిసిల్లలో 2.2, కోనరావుపేటలో 1.3, వీర్నపల్లిలో 1.7, ఇల్లంతకుంటలో 2.1 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో వర్షం పడలేదు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల ఆహ్వానం

- మున్సిపల్ కమిషనర్ ఆయాజ్

సిరిసిల్లటౌన్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'గృహలక్ష్మి' పథకానికి అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ పేర్కొన్నారు. సర్కారు మార్గదర్శకాల ప్రకారం ఆయా వర్గాలకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు శనివారం ప్రకటనను విడుదల చేశారు. ఎస్సీలకు 20శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీ, మైనార్టీలకు 50శాతం మించకుండా రిజర్వేషన్లు ఖరారు చేశామన్నారు. దరఖాస్తు మహిళల పేరుతో ఉండాలన్నారు. ఆహారభద్రత కార్డు, గృహసంబంధ స్థలంతోపాటు సిరిసిల్ల పట్టణంలో నివసిస్తున్నట్లు ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపుకార్డును దరఖాస్తులతో జతచేయాలని సూచించారు. అర్హత గల మహిళలు, వితంతు మహిళలు ఈనెల 7 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు మున్సిపల్ ఆఫీస్‌లో సిటిజన్ సర్వీస్ ప్రత్యేక కౌంటర్‌లో అందించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని కందికట్కూర్‌లోని 8వ వార్డు సభ్యురాలు న్యాత లతను కులం పేరుతో దూషించారన్న ఫిర్యాదుపై డీఎస్పీ ఉదయ్‌రెడ్డి శనివారం గ్రామంలో విచారణ చేపట్టారు. గత నెలలో తన వార్డులో పర్యటిస్తుండగా భూపతి వెంకటేశం అనే వ్యక్తి తనను కులం పేరుతో దూషించాడని న్యాత లత ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

చందుర్తి(వేములవాడ): విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన మండలంలో నర్సింగపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. నర్సింగపూర్‌కు చెందిన చింతకుంట మల్లేశం శనివారం ఉదయం పత్తి చేను దున్నేందుకు ఎడ్లను తోలుకుని వెళ్తుండగా ఒంటితట్టే ఒర్రె సమీపంలో విద్యుత్ తీగలు తెగి కింద పడ్డాయి. ఆ తీగలు తగిలి ఎద్దు కింద పడిపోయింది. వెంటనే తేరుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి వచ్చి లోపే ఎద్దు మృతి చెందింది. రైతుకు సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లింది. సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు సంఘటన స్థలానికి వెళ్లి రైతు మల్లేశంను పరామర్శించారు. ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీపీ బైరగోని లావణ్య, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మండల కో–ఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, నర్సింగపూర్ మాజీ సర్పంచ్ మరాఠి మల్లిక్ తదితరులు ఉన్నారు.



రైతును పరామర్శిస్తున్న సెస్ డైరెక్టర్

ఆ పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- ఎస్సై, ఏఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లపై ఫిర్యాదు
- ఎస్పీ అఖిల్ మహాజన్‌కు చంద్రశేఖర్ భార్య ఫిర్యాదు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల కోర్టులో ఈనెల 1వ తేదీన ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటనలో బాధితుడు గురజాల చంద్రశేఖర్ భార్య గురజాల వసంత ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు ఫిర్యాదు చేసింది. భూతగాదాలో తన భర్త తప్పు చేయకున్నా గ్రామానికి చెందిన మల్లేశంకు అనుకూలంగా ఎస్సై మహేందర్, ఏఎస్సై బాబు, నలుగురు కానిస్టేబుళ్లు వేధించారని ఫిర్యాదులో పేర్కొంది. విపరీతంగా కొట్టి భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా..పోలీస్‌స్టేషన్‌లో రోజంతా ఉంచుకుని వదిలేశారన్నారు. మల్లేశంతోపాటు ఎస్సై, ఏఎస్సై, నలుగురు కానిస్టేబుల్స్‌తో చంద్రశేఖర్‌కు ప్రాణహాని ఉన్నందునే తన భర్త సిరిసిల్ల కోర్టు ప్రాంగణంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. కాగా.. ఈ విషయంలో సిరిసిల్లకు చెందిన ఓ సీఐని ఎస్పీ అఖిల్ మహాజన్ నియమించి విచారణ చేయిస్తున్నట్లు సమాచారం.

జీపీఎఫ్ సమస్యలు పరిష్కరించండి

సిరిసిల్లటౌన్: జెడ్పీ జీపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం జెడ్పీ ఆఫీస్ ముందు నిరసన తెలిపారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సాధారణ భవిష్య నిధిపై ఉన్న ఆర్థిక ఆంక్షలు వెంటనే తొలగించాలని, పెండింగ్ రుణాలు విడుదల చేయాలని కోరారు. 2006–07 నుంచి 2021–22 వరకు జెడ్పీపీఎఫ్ మొత్తం రూ.2,741.82 కోట్లు చెల్లించాలని కోరారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుమాల రమానాథ్‌రెడ్డి, పూరెళ్ల రవీందర్, గుజ్జునేని వేణుగోపాల్‌రావు, వికృతి అంజయ్య, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ ఆఫీస్ ముందు టీపీటీఎఫ్ నిరసన

రాజన్న హుండీ ఆదాయం రూ.1.35కోట్లు

వేములవాడ: రాజన్నకు 22 రోజుల హుండీ ద్వారా రూ.1.35 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. గుడి ఓపెన్‌స్లాబ్‌లో కట్టు దిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్యలో శనివారం హుండీ లెక్కింపు సాగింది. రూ.1,35,25,130 నగదు, 176 గ్రాముల బంగారం, 9.750 గ్రాముల వెండి సమకూరినట్లు ఈవో తెలిపారు. ఏఈవోలు నవీన్, శ్రీనివాస్, జయకుమారి తదితరులు పాల్గొన్నారు.



నగదు లెక్కిస్తున్న రాజరాజేశ్వరీ సేవా సమితి సభ్యులు

రెడ్డితండాలో మూడిళ్లలో దొంగతనాలు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని జైసేవాలాల్ భుక్యారెడ్డితండాలో శనివారం తెల్లవారుజామున మూడిళ్లలో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన భుక్య మోహన్ ఇంట్లో రూ.50 వేల నగదు, 3 తులాల బంగారం, 50 తులాల వెండి ఎత్తుకెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన భుక్య మహిపాల్ ఇంట్లో 6 తులాల వెండి, 15 తులాల పట్టగొలుసులు, భూక్యా నౌశిలాల్ ఇంట్లో రూ.4,300 నగదు ఎత్తుకెళ్లారు. సర్పంచ్ భుక్య ప్రమీల పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందం వచ్చి ఆధారాలు సేకరించారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు విచారణ చేపట్టారు.



రెడ్డితండాలో విచారణ చేపడుతున్న పోలీసులు

జిల్లా క్రీడోత్సవాలకు సిద్ధం

- డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్లటౌన్: జిల్లా స్థాయి క్రీడోత్సవాలను ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించడానికి వేదిక సిద్ధమైందని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. అంబేడ్కర్‌నగర్ జెడ్పీ పాఠశాలలో శనివారం నిర్వహించిన క్రీడా సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. అన్ని మండలాల్లో జిల్లా క్రీడోత్సవాలు ముందే నిర్వహించుకోవాలని సూచించారు. జిల్లా క్రీడాధికారి అజ్మీరా రామదాసు, సమాఖ్య సెక్రటరీ దేవత ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు దేవేందర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

గవర్నర్ తీరుపై నిరసనగా బస్సుల బంద్



సిరిసిల్ల డిపో వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

సిరిసిల్లటౌన్: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ ప్రభుత్వం పంపిన బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడంపై నిరసనలు హోరెత్తాయి. సిరిసిల్ల డిపోలో శనివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు బస్సులు బంద్‌చేసి నిరసన వ్యక్తం చేశారు. ఎస్.రాంరెడ్డి, జి.పి.సింగ్, ప్రశాంత్‌కుమార్, రాజేందర్, కవిత, ఉమ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ కోరారు. ముస్తాబాద్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ముస్తాబాద్‌లోని ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు తీసుకుంటున్నారని, తల్లిదండ్రులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే స్కూల్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకుడు జి.మహేశ్ ఉన్నారు.

ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి కరీంనగర్ ఎల్ఎండీకి నీటి విడుదల కొనసాగుతోంది. శనివారం ఎల్ఎండీకి 1,536 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 1,200 క్యూసెక్కుల మేర వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 20.45 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.